# తారల అభిప్రాయాలు

ఒక వ్యక్తి ఏదైనా ఘనకార్యం-సాధారణంగా ఎవరూ చేయలేని ఘనకార్యం చేస్తే అతడుగాని, ఆమెగాని ప్రపంచదృష్టిని ఆకర్షించిన వారవుతారు. అందరూ ఆ వ్యక్తిని గురించే మాటాడతారు. 'ఓహో!' అంటారు, 'ఆహా!' అంటారు. సభలుచేసి ఆ వ్యక్తిని అందలానికి ఎక్కిస్తారు. బిరుదులూ, పతకాలూ ఇస్తారు. ప్రజల తరఫున పత్రికా ప్రతినిధులు ఆ వ్యక్తిని సందర్శించి-'ఇంటర్వ్యూ' చేసి-ఆ వ్యక్తియొక్క అభిప్రాయాలను-ప్రజలకు వినడానికి ఇంపైన ఏ అభిప్రాయమైనా సరే, దేన్నిగురించైనా సరే పత్రికలలో ప్రచారం చేస్తారు ఫోటోతో సహా.

* * *

అంటే, ఆ వ్యక్తికి మీకూ, నాకూ లభించనటువంటి ప్రాముఖ్యత, గౌరవం ఏర్పడుతాయి-ప్రజలు వీటిని ఆ వ్యక్తికి కట్టబెట్టి వినయంగా ప్రణమిల్లుతారు.

ఇటువంటి గౌరవాలు చాలాకాలంనుంచి కవులకూ, పండితులకూ. చిత్రకారులకూ, కేబినెట్ మంత్రులకూ, వస్తాదులకూ, వగైరా వగైరాలకు లభిస్తున్నాయి.

* * *

ఈనాడు పైనచెప్పిన గౌరవం ఫిలిం తారలకుకూడా జరుగుతూంది. నిజానికి, ప్రపంచం ఈనాడు ఎక్కువగా గౌరవించేదీ, మెచ్చుకొనేదీ ఒక్క ఫిలింతారలనే యేమోకూడా! ఫిలింప్రపంచంలో ఘనత, గౌరవం రావడం అతి సులువు. ఈవేళ రోడ్డు మార్జిన్‌లో సంచరిస్తూండే వ్యక్తి రాత్రికిరాత్రి ఏదో వొక ఫిలింలో నటించినంతమాత్రాన మర్నాడు తెల్లవారేసరికి ప్రపంచం దృష్టినంతా తనవైపుకు ఆకర్షించుకోవడం జరుగుతూంది. మహాకావ్యాలు వ్రాసిన కవిశ్రేష్ఠుడూ, గొప్ప రాజకీయ

ప్రతిష్ఠంభనను తెలివితేటలుగా అంతరింపజేసిన రాచకీయవేత్తలూ, ఒక మహాజాడ్యాన్ని అంతరింపజేసే మందును పరిశోధించి, మానవజాతిని ఉద్ధరించిన విజ్ఞానవేత్తలూ, సంవత్సరాలతరబడి మెడ ఇటూఅటూ త్రిప్పుతూ, రాగాలాపనలో మునిగి తేలుతూ, అంతులేని ఆయాసం పడుతూండే గాయక శిఖామణులూ వీరంతా పొందలేని కీర్తిని, ఘనతనూ, గౌరవాన్ని ఫిలింతార అరక్షణంలో పొందుతూంది—

* * *

ఇటువంటి మూర్తీభవించిన మహావిప్లవాన్ని ఫిలింతారను-సందర్శిస్తారు పత్రికలవాళ్లు—

ఆది మురిసిపోతుంది!

'బంగాళాదుంపలను గురించీ, ద్వితీయ ప్రపంచ యుద్ధం గురించీ, అట్లాంటిక్ చార్టర్ను గురించీ, పులిహోర అటుకులను గురించీ మీ అభిప్రాయం ఏమిటంటాడు?' ఆమెను ఇంటర్వ్యూచేసే ఆయన.

'మీ అభిప్రాయమే, నా అభిప్రాయంకూడాను. మీకు తోచిన అభిప్రాయాలు నేను చెప్పినట్టేరాసి మీ పేపర్లో వేసుకోండి-ఇదుగో నాఫోటో! లేటెస్టుపోజు!' అంటుంది తారామణి.

ఆ చిన్ని బుర్రలో ఇమడని భావాలను, ఆమె తరఫున తనే సృష్టించి, అవి ఆమెకు ఆరోపించి, ఆమె కీర్తిని వృద్ధిచేయడానికి పాటుపడుతున్నాడు ఇంటర్వ్యూచేసే ఆయన. పాపం! ఆయన శ్రమకు అరకప్పు కాఫీయేనా వుందో లేదో.........?